# 18. విచిత్రమైన అంతరంగం

మానవ అంతరంగం బహు విచిత్రమైనది. అది ఓపట్టాన మనకు లొంగదు. అనుక్షణం అది తన పరిధిని దాటిపోవడానికి ప్రయత్నిస్తుంది. ఎవరైనా సన్మార్గంలో నడుస్తూ సత్కార్యాలు చేస్తున్నాడంటే, అతను తన అంతరంగాన్ని దాని సహజపరిధిలో బంధించాడన్న మాట. నిజానికి అంతరంగంపై అదుపు సాధించడం గొప్ప (ఘన)కార్యమే. అంతరంగంపై అదుపు సాధించలేనివాడ్ని మనం సాధారణంగా చపలచిత్తుడు లేక చంచలస్వభావుడని అంటాము. మనిషి ప్రవర్తన రీత్యా ఖుర్‌ఆన్ ఈ అంతరంగాన్ని మూడు రకాలుగా విభజించింది.

ఖుర్‌ఆన్ పరిభాషలో మొదటిరకం అంతరంగాన్ని "నఫ్సుల్‌అమ్మారా" అంటారు. స్వభావరీత్యా దీన్ని "దుష్టమనస్సు" లేక దుష్టబుద్ధి అని చెప్పవచ్చు. కోరలు చాచి బుసలు కొడ్తూ మీదికి వచ్చే భయంకర విషసర్పాన్ని చంపడంకన్నా దుష్టమనస్సుని చంపడమే గొప్ప కార్యమన్నాడు ఓ కవి. దీన్నిబట్టి ఇది ఎంత ప్రమాదకరమైనదో ఊహించవచ్చు. ఇది మానవుడ్ని రకరకాల చెడుల వైపుకు ఉసిగొల్పుతుంది. భయాందోళనలు కలిగించి సత్కార్యాల నుండి బయటికి లాగుతుంది. వివిధ భ్రమలు కల్పించి దుష్కార్యాల ఊబిలోకి నెట్టివేస్తుంది. రకరకాల ప్రలోభాలు చూపి, చివరికి మనిషిని నట్టేట ముంచుతుంది. నఫ్సుల్‌అమ్మారా గురించి ఖుర్‌ఆన్‌లో ఒకచోట ఇలా ఉంది:

"నేను నా ఆత్మశుద్ధిని గురించి గొప్పలు చెప్పుకోవడం లేదు. నా ప్రభువు కారుణ్య భాగ్యం లభిస్తే తప్ప (దుష్ట) మనస్సు ఎల్లప్పుడూ చెడు వైపుకే పురిగొల్పుతూ ఉంటుంది. నిస్సందేహంగా నా ప్రభువు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (12:53)

రెండోరకం అంతరంగాన్ని "నఫ్సుల్లవ్వామా" అంటారు. ఇది చేసే పనిని బట్టి దీన్ని "అంతరాత్మ" అని పేర్కొనవచ్చు. చెడ్డ పనులకు పాల్పడినప్పుడల్లా అంతరాత్మ మనల్ని నిందిస్తుంది, ఆక్షేపిస్తుంది, అభ్యంతరం చెబుతుంది. "ఆ పని చేస్తే నువ్వు నాశనమవుతావు, పట్టుబడి పోతావు" అని హెచ్చరిస్తుంది.

అంతరాత్మ సజీవంగా ఉంటే మనిషి ఎలాంటి చెడు వైపు ఆకర్షించబడలేదు. ఒకవేళ ఎప్పుడైనా ఆకర్షించబడినా అంతరాత్మ హెచ్చరిస్తూ, నిందిస్తూ అతడ్ని ప్రశాంతంగా ఉండ నివ్వదు. ఇలా అంతరాత్మ మనల్ని చెడుపనుల జోలికి పోనివ్వకుండా అడుగడుగునా అడ్డ తగుల్తుంది. అంతరాత్మ ప్రబోధాన్ని ఆలకించేవారు ఇహలోకంలోనే కాదు, పరలోకంలోనూ విజయశిఖరాలు అధిరోహించ గలుగుతారు.

అంతరాత్మ ప్రబోధం వినకుండా దాన్ని అణచడానికి ప్రయత్నిస్తే మనం దారితప్పి చీకటి అగాధాల్లోకి పడిపోయినట్లే. మన శ్రేయస్సు కోరుతూ మనకు బాడీగార్డ్‌గా పనిచేసే ఈ అంతరాత్మను అణచివేయడమంటే మన బాడీగార్డ్‌ని మనమే చేజేతులా చంపుకున్నట్లవు తుంది. బాడీగార్డ్ పోయాక మన స్థితి ఏమవుతుందో తెలిసిందే. అడుగడుగునా ప్రమాదాలే ఎదురవుతాయి. ఈ అంతరాత్మ గురించే దేవుడు ఖుర్‌ఆన్‌లో ఇలా అంటున్నాడు:

"నేను ప్రళయం సాక్షిగా చెబుతున్నాను. (మీరనుకునేది ఎంత మాత్రం నిజం) కాదు. నేను తనను తాను నిందించుకునే ఆత్మసాక్షిగా చెబుతున్నాను..." (75:1-4)



పై సూక్తుల్లో దేవుడు అవిశ్వాసుల కుశంకల్ని ఖండిస్తూ ప్రళయదినం తప్పక వస్తుందని ఆరోజు మానవులంతా మళ్ళీ బ్రతికించబడతారని, వారినుంచి కర్మల లెక్క తీసుకోడం జరుగుతుందని ప్రళయ దినం మీద, అంతరాత్మ మీద ప్రమాణం చేసి హెచ్చరిస్తున్నాడు.

నఫ్సుల్లవ్వామా గురించి దైవప్రవక్త (స) "ఏ విషయమైతే మీ హృదయంలో ఆక్షేపణ జనింపజేస్తుందో అదే చెడు" అన్నారు. అంటే మనం చేస్తున్నది తప్పుడు పనని మన అంతరాత్మ ఆక్షేపిస్తుంది. ఈ అనుభూతే మనిషిని చెడులకు దూరంగా ఉంచుతుంది. అంతరాత్మను గురించి దైవప్రవక్త (స) మరింత వివరంగా ఇలా తెలియజేశారు:

"జాగ్రత్తగా వినండి! మన దేహంలో ఒక మాంసపు ముద్ద ఉంది. అది మంచి స్థితిలో ఉంటే మొత్తం దేహం మంచి స్థితిలో ఉంటుంది. ఒకవేళ అది చెడిపోతే మొత్తం దేహమే చెడిపోతుంది. (అనారోగ్యం పాలవుతుంది.) అదే హృదయం." (మిష్కాత్)

ఈ హృదయం నైతికంగా, ఆధ్యాత్మికంగా మంచిస్థితిలో ఉన్నప్పుడు నఫ్సుల్లవ్వామా (అంతరాత్మ) అనబడుతుంది. మనిషిని చెడువిషయాల నుంచి నిరోధించే, మంచి వైపుకు ప్రేరేపించే 'నఫ్సుల్లవ్వామా' అతని విశ్వాసాలు, ఆచరణలు, నీతి నడవడికలపై 'సెక్యూరిటీ గార్డ్'గా పనిచేస్తుంది. శరీరంలోని ఈ సెక్యూరిటీగార్డ్ అనారోగ్యం పాలయ్యే కొద్దీ మనిషి 'నఫ్సుల్‌అమ్మారా' (దుష్టమనస్సు)కు చేరువవుతూ చెడ్డపనులు చేయడం ప్రారంభిస్తాడు. దీనికిభిన్నంగా మనిషి నఫ్సుల్లవ్వామా (అంతరాత్మ) ప్రబోధం విని నడచుకుంటే క్రమేణా అతడు మూడవ రకం అంతరంగమైన "నఫ్సుల్ ముత్మయిన్న" (సంతృప్త హృదయం)కు దగ్గరవుతాడు. ఈకోవకు చెందిన అంతరంగం గురించి ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

"(సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నుడయిన మనిషిని ఉద్దేశించి) 'తృప్తిచెందిన మనసా! పద నీప్రభువు సన్నిధికి. నీవు ఆయన పట్ల సంతో షించావు, ఆయన నీ పట్ల ప్రసన్నుడయ్యాడు. (ఇక) నా పుణ్యదాసులలో చేరి నా స్వర్గంలో ప్రవేశించు' అని చెప్పడం జరుగుతుంది." (89:27-30)

ప్రఖ్యాత వ్యాఖ్యానసహిత ఖుర్‌ఆన్ అనువాద గ్రంథమైన 'రూహుల్ బయాన్'లో వ్యాఖ్యానకర్త నఫ్సుల్ ముత్మయిన్న గురించి వివరిస్తూ "నఫ్సుల్ ముత్మయిన్న అంటే ఎలాంటి చెడువిషయాలు లేని పరిశుద్ధమైన, అత్యున్నత సుగుణసంపత్తితో కూడిన జ్యోతిర్మయ హృదయం అన్నమాట" అని పేర్కొన్నారు.

భౌతికావసరాలు నెరవేరితే చాలు, ఇక ఏ సమస్యా ఉండదంటారు పదార్థపూజా రులు. ఇది కొంతవరకు నిజమే. కాని సకలవిధాల భోగభాగ్యాలతో తులతూగుతున్న పాశ్చాత్యదేశాల్లో ఎందరో ప్రజలు మనశ్శాంతి లభించక జీవితంపైనే విరక్తి చెందుతున్నారు. లక్షలు ఖర్చుపెట్టినా పొందలేని మనశ్శాంతి దేవుని స్మరణ ద్వారా మాత్రమే ప్రాప్తమవు తుందని ఖుర్‌ఆన్ చెబుతోంది. ఇక్కడ దేవునిస్మరణ అంటే ఓ చోట తిష్టవేసి కళ్ళు మూసుకొని దైవనామం జపించడం కాదు. మనిషి తనను తాను పూర్తిగా దేవునికి సమర్పించుకొని జీవిత సమస్తరంగాల్లో ఆయన ఆజ్ఞలు, హితవులు పాటించాలి. అప్పుడే అతనికి నిజమైన మనశ్శాంతి, హృదయ సంతృప్తి లభిస్తాయి.